సాక్షి ప్రకాశం

శుక్రవారం । 1 । మార్చి । 2024



నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. - 8లో..



నిరుపేదలకు సేవ చేయాలి

వైద్య విద్య పూర్తిచేసిన వారంతా నిరుపేదలకు సేవ చేయాలని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ పిలుపునిచ్చారు. ఒంగోలు రిమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/23.5

వాతావరణం

ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.. ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

టెట్ పరీక్షలకు 65 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టుకు శుక్రవారం 65 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్థానిక మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి యాక్షన్ ఆఫ్ ఇండియాలో 477 మందికిగానూ 439 మంది, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో 310 మందికిగానూ 283 మంది హాజరయ్యారు. మొత్తంమీద 787 మందికిగానూ 722 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరు



పురాతన వేణుగోపాలస్వామి ఆలయం

మద్దిపాడు: మండలంలోని నేలటూరివారిపాలెం, సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెం జంట గ్రామాలకు సంబంధించి గురవారెడ్డిపాలెంలో ఉన్న వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ కోటీ పాతిక లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు కంచి జయబాలిరెడ్డి, ఎస్.అంజిరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, మారెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, కంచి సుధాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు, భక్తులు పునర్నిర్మాణం చేయాలని దేవదాయశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారన్నారు. ఆ మేరకు ప్రజల భాగస్వామ్యం రూ.41 లక్షలు, దేవదాయశాఖ రూ.84 లక్షలు కలిపి కోటీ పాతిక లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆ నిధులతో వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఎస్ అగ్రికల్చర్ కాలేజీకి ఐకార్ గుర్తింపు



మాట్లాడుతున్న నాదెళ్ల చంద్రమౌళి

మార్కాపురం: స్థానిక నాదెళ్ల సుబ్రహ్మణ్యం వ్యవసాయ కళాశాలకు జాతీయ స్థాయిలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ఫౌండర్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 2016లో మార్కాపురంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఎన్ఎస్ అగ్రికల్చర్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల కేంద్ర బృందం కళాశాలను సందర్శించి వసతులు, ల్యాబ్, బోధన, హాస్టల్ వసతి, ఫారం తదితర అంశాలను చూసి 2029 వరకూ అక్రిడేషన్ (ఐకార్) గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్వైజర్ ఎన్‌జీ రంగ వ్యవసాయ విద్యాలయ మాజీ వీసీ డాక్టర్ పి.రాఘవరెడ్డి, కళాశాల డీన్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి అస్థికలు నిమజ్జనం చేసి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్టూరు: తండ్రి అస్థికలు నిమజ్జనం చేసి వస్తూ రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందిన విషాదకర ఘటన జాతీయ రహదారిపై మార్టూరు మండలం ఇసుకదర్శి సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మేదరమెట్లకు చెందిన గుడిపాటి నాగబ్రహ్మం (45) ఇటీవల మృతిచెందిన తన తండ్రి అస్థికలను విజయవాడ కృష్ణానదిలో గురువారం ఉదయం నిమజ్జనం చేశాడు. తమ్ముడు సాంబశివరావుతో కలిసి బైకుపై తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక ఇసుకదర్శి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రాజమండ్రి నుంచి పొదిలి వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వీరి బైకు బలంగా ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న నాగబ్రహ్మం తీవ్రగాయాలతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. బైకు వెనుక కూర్చున్న సాంబశివరావుకు స్వల్పగాయాలయ్యాయి. అతన్ని హైవే మొబైల్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ప్రమాదస్థలికి చేరుకుని నాగబ్రహ్మం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆరంభం అదిరింది..!

కేజీ@రూ.250

పొగాకు కొనుగోళ్ల ప్రారంభం అదిరింది. తొలి రోజు కేజీ రూ.250 పలకగా, సరాసరి రూ.230గా నమోదైంది. మూడేళ్లుగా లాభాలు చవిచూస్తున్న రైతన్నలకు ఈ దఫా ప్రారంభం మంచి ధరలు పలకడంతో అంతా శుభసూచికంగా మారనుంది. రీజియన్ పరిధిలో 11 వేలం కేంద్రాలు ఉండగా, రెండు కేంద్రాల్లో గురువారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పొగాకు బోర్డు 88.68 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతివ్వగా, సాగు విస్తీర్ణం పెరగడంతో 134 మిలియన్ కేజీలు రావచ్చని బోర్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

- జిల్లాలో ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు
- ఒంగోలు-1, కొండపిలో మొదలైన వేలం
- తొలి రోజే కేజీ సరాసరి రూ.230
- గతేడాది ప్రారంభపు ధర సరాసరి రూ.200
- వేలం చివర్లో అత్యధిక సరాసరి రూ.289
- 88.68 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి
- ఈ ఏడాది కొనుగోళ్ల అంచనా 134 మిలియన్ కేజీలు
- కర్ణాటకలో అత్యధిక ధర ఇప్పటి వరకు రూ.290
- కొనుగోళ్లను ప్రారంభించిన బోర్డు ఈడీ శ్రీధర్



పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్



ఒంగోలు-1 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్

చీమకుర్తి: పొగాకు రైతుకు అంతా మంచి రోజులే.. మూడేళ్లుగా ఊహించని విధంగా మార్కెట్లో ధరలు పలుకుతుండటంతో లాభాల బాట పడుతున్నారు. లాభాలు వస్తుండటంతో రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచుకుంటూ పోతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది విస్తీర్ణం భారీగా పెరిగింది. బోర్డు అధికారుల గణాంకాలు ఇలా ఉన్నాయి. గతేడాది 29,100 మంది రైతులు 23,930 బ్యారన్ల ద్వారా 57,230 హెక్టార్లలో సాగుకు బోర్డు అనుమతిచ్చింది. రైతులు మాత్రం 64,370 హెక్టార్లలో సాగు చేశారు. పొగాకు క్వాంటిటీ ఆథరైజేషన్ (ఉత్పత్తి) బోర్డు 88.68 మిలియన్ కేజీలకు అనుమతివ్వగా 123.11 మిలియన్ కేజీలు ఉత్పత్తి చేశారు. పొగాకు డిమాండ్ పెరగటంతో ఉత్పత్తి చేసిన పొగాకును కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా రైతులు, బ్యారన్ల సంఖ్యలో మార్పు లేనప్పటికీ సాగు విస్తీర్ణం 72,100 హెక్టార్లకు చేరింది. పొగాకు క్వాంటిటీ గతేడాది 123.11 మిలియన్ కేజీలు కాగా, ఈ ఏడాది 134 మిలియన్ కేజీలకు పెరగనుంది. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రైతులు సాగుచేసిన విస్తీర్ణం, ఉత్పత్తి అంచనా కూడా పెరగటం గమనార్హం. గత ఏడాది ఒక్కో బ్యారన్‌కు దాదాపు సరాసరిన రూ.5 లక్షల నుంచి 7 లక్షల వరకు రైతులు లాభాలు గడించారు. అదే ఉత్సాహంతో ఈ ఏడాది వర్షాలు తగ్గినా ఎక్కువ ధర పెట్టి పొలాలు, బ్యారన్‌లను కౌలుకు తీసుకుని మరీ సాగు చేశారు. దానికి తగ్గట్టుగానే ప్రారంభ ధర కూడా గత ఏడాదితో పోల్చుకుంటే కేజీకి 34 అదనంగా రావడంతో రైతుల పంట పండినట్టే. ప్రస్తుతం కర్ణాటకలో మరో రెండు వారాల్లో పొగాకు వేలం ముగియనుంది. ప్రస్తుతం అక్కడ పొగాకు ధర కేజీ రూ.290 పలికింది. అదే గతేడాది మన జిల్లాలో అత్యధికంగా కేజీకి రూ.289 పలికింది. పొగాకు డిమాండ్ గత ఏడాదితో పోల్చుకుంటే పెద్దగా తగ్గినట్లు లేదని బయ్యర్ల కొనుగోళ్ల దూకుడు స్పష్టం చేస్తోంది.

మొదటిరోజు ఒంగోలు-1, కొండపిలో వేలం...

గతేడాది ఫిబ్రవరి నెల 24న పొగాకు కొనుగోళ్ల ప్రారంభం కాగా, ఈ ఏడాది జిల్లాలోని 11 వేలం కేంద్రాల్లో మొదటి రోజు గురువారం ఒంగోలు-1, కొండపిలో మాత్రమే ప్రారంభించారు. బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ ఒంగోలు-1 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభించి పర్యవేక్షించారు. ఒంగోలు-1లో 18, కొండపి కేంద్రంలో 18 బేళ్లు కలిపి మొత్తం 36 బేళ్లు కొనుగోలు చేశారు. తొలిరోజు మొత్తం 13 మంది బయ్యర్లు పాల్గొన్నారు. వేలంలో బోర్డు డైరెక్టర్ మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం నిర్వహణాధికారులు పాల్గొన్నారు.

> **రైతులకు మంచి గిట్టుబాటు ధర ఇవ్వండి**
>
> ఈ ఏడాది కూడా మంచి ఆశాజనకమైన ధరలు రావచ్చు. రైతులు సాగుచేస్తున్న ఖర్చులు ఏటికేడు పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాదికన్నా కూడా ఈ ఏడాది మంచి గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. బయ్యర్లు రైతులకు అండగా నిలవండి.
>
> – అద్దంకి శ్రీధర్, పొగాకు బోర్డు ఈడీ

సిద్ధం సభ ఏర్పాట్ల పరిశీలన



సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

మేదరమెట్ల: సిద్ధం సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల మండలం పీ గుడిపాడు వద్ద మార్చి 10న జరగబోయే సభకు హాజరయ్యేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. అందులో భాగంగానే తాను ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చినహనిమిరెడ్డి, నాయకులు ఉన్నారు.

శ్రీశైలానికి పెరుగుతున్న రద్దీ

- శివరాత్రి సందర్భంగా భక్తుల రాత్రి పూట ప్రయాణాలకు అనుమతిచ్చిన అటవీశాఖ
- మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు అనుమతులు



విద్యుత్ దీపాలంకరణలో శ్రీశైల ముఖద్వారం

పెద్దదోర్నాల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా శ్రీశైలం తరలివెళ్తున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో శ్రీశైలం ఘాట్‌రోడ్డులో రాత్రివేళల్లో కూడా ప్రయాణాలకు అటవీశాఖ అనుమతిచ్చింది. నేటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రాత్రి వేళల్లోనూ నిరంతరం ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నిత్యం యాగశాలప్రవేశం, విఘ్నేశ్వరపూజ, సంకల్పం, స్వస్తి పుణ్యాహం, చండీశ్వరపూజ, కంకనపూజ, కంకన ధారణ వాస్తుపూజ, వాస్తుహోమం, నవగ్రహ మండపారాధన తదితర కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. భ్రమరాంబాదేవి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, చండీహోమం తదితర కార్యక్రమాలతో పాటు స్వామివారి కళ్యాణ మహోత్సవం, శయన ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతుండటంతో పండుగకు ముందే పెద్దదోర్నాల మండల కేంద్రంలో రద్దీ ఏర్పడింది.

ప్రజల వద్దకే పరిపాలన

- గొప్ప వ్యవస్థలను తీసుకొచ్చిన సీఎం జగన్
- మంత్రి మేరుగు నాగార్జున
- మాచవరంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం



మాచవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: ప్రజలకు అవసరమైన అన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చి జవాబుదారీతనాన్ని పెంచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. నాగులుప్పలపాడు మండలంలోని మాచవరం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను గురువారం రాత్రి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి జగన్ సాకారం చేశారన్నారు. ఒకే గ్రామంలో ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రతి ఒక్కరికీ అవసరమైనవన్నీ అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ చాలా బాగా పనిచేస్తోందన్నారు. ఈ సచివాలయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులు, వలంటీర్లు జగనన్న సైన్యంలా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా...

కార్యకర్తలు, నాయకులనుద్దేశించి మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఏదైతే మాట చెప్పారో.. వాటన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారని తెలిపారు. తాను మాట ఇస్తే తప్పనని నిరూపించారన్నారు. ఆయన బాటలోనే పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా నడిచి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి ప్రతి అవసరంలో ముందుండాలని సీఎం సూచించారన్నారు. ఆయన మాటలను తూ.చా. తప్పకుండా పాటించి ప్రతి కార్యకర్తకు నిరంతరం అందుబాటులో ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. రాబోయే 45 రోజులు మనందరం ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చి 175 అసెంబ్లీ నియోజవర్గాలను గెలిచి ప్రజా నాయకుడిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు సమాయత్తం కావాలన్నారు. మాచవరం గ్రామంలో ఇనగంటి సోదరుల అండతో గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడతాన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రారంభించిన ఎన్నికలకు సిద్ధం సభ మార్చి 10వ తేదీ మేదరమెట్ల వద్ద పెద్ద ఎత్తున జరగనున్న క్రమంలో ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావాలని మంత్రి మేరుగు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లికార్జునరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, గ్రామ సర్పంచ్ ఇనగంటి సీతారావమ్మ, రాపర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు ఇనగంటి రమణారెడ్డి, లిడ్ క్యాప్, హౌసింగ్ స్టేట్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, కొలకలూరి విజయ్ కుమార్, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పులిచర్ల పరంధామిరెడ్డి, వాకా కోటిరెడ్డి, డాకా రమణారెడ్డి, కుమ్మూరి సుధాకర్, కోయి హనుమయ్య, పంచాయతీరాజ్ డీఈ కృష్ణమోహన్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల సంతను సద్వినియోగం చేసుకోండి...

చీమకుర్తి: పశువుల సంతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మేరుగు నాగార్జున సూచించారు. గురువారం సంతనూతలపాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పశువుల సంతను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. గత మూడు సంవత్సరాల నుంచి కరోనా కారణంగా నిలిచిపోయిన పశువుల సంతను తిరిగి పునః ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పశువుల సంతను ప్రారంభించటం వలన నియోజకవర్గంలోని నాలుగు మండలాల పశుపోషకులకే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గాల్లోని మండలాల రైతులకు కూడా ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్రకుమార్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పశువుల సంతను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశం
- 9 గంటలు దాటితే అనుమతిలేదు
- అవసరమైన మార్గాల్లో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు
- పరీక్ష కేంద్రంలోకి బోర్డు సూచించిన సాధారణ మొబైల్ తప్ప మరో ఫోన్‌కు అనుమతిలేదు
- ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమేరాలతో నిఘా
- 3 ఫ్లయింగ్, 3 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు
- జిల్లాలో 5 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు గుర్తింపు

ఒంగోలు: నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనుండగా, ఇప్పటికే పరీక్షల విధులకు సంబంధించి సూచనలతో పాటు నిర్లక్ష్యం వహిస్తే తీసుకునే చర్యలపై హెచ్చరికలు కూడా జారీ చేశారు. పరీక్షలు జరుగుతున్నంతసేపూ పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్ల మూసివేత, 144 సెక్షన్ అమలు చేస్తారు. పరీక్షల సందర్భంగా ఎవరైనా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ హెచ్చరించారు.

జిల్లాలో హాజరుకానున్న విద్యార్థులు 44,733 మంది...

జిల్లాల విభజన తర్వాత తొలిసారిగా నూతన ప్రకాశం జిల్లాలోని 69 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టారు. వీటిలో కంభం, పెదదోర్నాల, అర్ధవీడు, వై.పాలెం, గిద్దలూరు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 21,570 మంది, ద్వితీయ సంవత్సరం 23,163 మంది కలిపి మొత్తం 44,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 69 పరీక్ష కేంద్రాలకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 965 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఎట్టి పరిస్థితుల్లో 9 గంటల తర్వాత అనుమతించరు. పరీక్షలను పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 3 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద, ప్రశ్నపత్రాలు, సమాధానాల పత్రాల తరలింపు ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలందాయి.

పూర్తిస్థాయిలో నిఘా...

పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ వంటివి చోటుచేసుకోకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే రూములతో పాటు ప్రశ్నపత్రాలను ఓపెన్ చేసే ప్రాంతంలో, సమాధాన పత్రాలను ప్యాకింగ్ చేసే రూములో కూడా సీసీ కెమేరాల నిఘా ఉంటుంది. మరోవైపు మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రంలోకి అనుమతించడాన్ని నిషేధించారు. కేవలం ఇంటర్ బోర్డు జారీచేసే సాధారణ మొబైల్ ఒకటి మాత్రమే చీఫ్ సూపరింటెండెంట్ వద్ద ఉంటుంది. దానిని కూడా ఆయన పూర్తిగా నిర్ధీత సమయంలో మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టారు. పోలీసు అధికారులు, వైద్య సిబ్బందితో సహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ తీసుకెళ్లడానికి వీల్లేదు.

విధుల్లో ఉండేవారికి ఐడీ తప్పనిసరి : ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్

పరీక్ష కేంద్రాల్లో విధుల్లో ఉండేవారు తప్పనిసరిగా ఐడీ కార్డుతోనే హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. ఐడీ కార్డు లేకపోతే లోపలకు అనుమతించరు. విద్యార్థులు, యాజమాన్యాలు, నిర్వహణ సిబ్బంది, ఇతరులెవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఎవరూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అవసరమైతే పరీక్షల కంట్రోల్ రూము నంబర్ 08592-281275ను సంప్రదించాలి. పరీక్ష కేంద్రంలోనే వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఏఎన్ఎంను కూడా అందుబాటులో ఉంచుతున్నాం. మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇవి కాకుండా ఏ కళాశాల యాజమాన్యమైన విద్యార్థులకు హాల్ టికెట్లు నిరాకరిస్తే వారి కాలేజీ గుర్తింపు కూడా రద్దు చేస్తాం.

వస్తువుల కొనుగోలులో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి

- జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి

ఒంగోలు సెంట్రల్: గ్రామ పంచాయతీలలో కొనుగోలు చేసే వివిధ రకాల వస్తువులు ఉత్తమ నాణ్యతా ప్రమాణాలు కలిగిన కంపెనీలవై ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి కోరారు. వివిధ రకాల మెటీరియల్స్ ఉండాల్సిన నాణ్యతా ప్రమాణాల విషయమై స్థానిక పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీడీఐఆర్‌డీ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెడ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి మాట్లాడుతూ బీఎస్ఐ మార్క్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని అలాంటి వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. పంచాయతీలలో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంట్, స్టీల్, వ్యవసాయ పనిముట్లు, కార్యాలయాలకు అవసరమైన వస్తువులు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్, పీవీసీ పైప్స్, మాస్కులు, గ్యాస్ స్టవ్‌లు, ప్రెజర్ కుక్కర్ తదితర వస్తువులు సంబంధిత బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ మార్కింగ్స్‌పై దృష్టి సారించాలని కోరారు. తదుపరి ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం మాట్లాడుతూ వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ, తదితర ముఖ్య అంశాలతో పాటు బీఎస్ఐ కేర్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన వర్క్ షాప్‌లో సర్పంచిలు, గ్రామ కార్యదర్శులు పాల్గొని అవగాహన పెంచుకోవాలని కోరారు. బీఎస్ఐ హైదరాబాద్ శాఖ జాయింట్ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్, సైంటిస్ట్ వాసు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలి
- వివిధ రకాల కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చూడాలి
- ఎన్నికలు సమీపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు అవసరం
- జిల్లా స్థాయి నేర సమీక్షలో ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి దిశానిర్దేశం

ఒంగోలు సబర్బన్: కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విషయంలోనూ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ట్రబుల్ షూటర్స్, చెడునడత కలిగినవారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. వారి కదలికలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. సమాజంలో వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన కేసులపై ఎస్పీ లోతుగా సమీక్షించారు. గత ఎన్నికల సమయంలో నమోదైన కేసుల పూర్తి వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పలు రకాల షీట్లు, పీడీ యాక్టు, గుడ్ ట్రయల్ మానిటరింగ్ కేసులుతోపాటు ఇతర కేసులపై సమీక్షించి ప్రస్తుత పరిస్థితిపై దృష్టి సారించాలన్నారు. కేసుల పురోగతిపై ఆరా తీసి ఆ కేసులను ఛేదించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. విచారణలో ఉన్న మర్డర్, మహిళలపై నేరాలు, దొంగతనాలు, పోక్సో, రేప్, ఇతర గ్రేవ్ కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. దర్యాప్తునకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని చెప్పారు. సంబంధిత కేసుల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్, పీఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించి నిర్దిష్ట సమయంలో చార్జిషీట్లు ఫైల్ చేయాలన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. దొంగతనాలు, దోపిడీ కేసుల్లో గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్ష పడేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండింగ్ ఎన్‌బిడబ్ల్యూఎస్‌ను త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలని, దొంగతనాల కేసుల్లో అన్నిరకాల కోణాల్లో విచారణ చేపట్టి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు.


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి, పక్కన ఏఎస్పీలు

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అలాంటి వ్యక్తులపై పీడీ యాక్టు అమలు చేయాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను విరివిగా సందర్శించి, లా అండ్ ఆర్డర్‌పై దృష్టి సారించాలని చెప్పారు. గ్రామాల్లోకి వచ్చి వెళ్లే వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు, కొత్త వ్యక్తులకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి, అక్కడ తగిన భద్రతా ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికల వేళ నమోదైన నేరాలపై సమీక్షించి, పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి సెక్టార్ పోలీస్ ఆఫీసర్ తన పరిధిలోని గ్రామాలను సందర్శించి, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందా, లేదా అనేది గుర్తించాలని, గతంలో ఏర్పడిన వర్గవిబేధాలు, రాజకీయ గొడవలు, ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది తదితర వివరాలు సేకరించాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సమీక్షలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధరబాబు, డీఎస్పీలు రామచంద్ర, రామరాజు, అశోక్ వర్ధన్, బాల సుందరం, వి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్, పోలీస్ లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మార్కాపురం: హత్యాయత్నం కేసులో నేరారోపణలు రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గురువారం మార్కాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి బి.దేవేందర్‌రెడ్డి తీర్పు వెల్లడించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు.. కొమరోలు మండలం పొట్టిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరు శివ, తల్లి కాశమ్మపై అదే గ్రామానికి చెందిన వారి బంధువైన గుంతపల్లి చిన్నబాదరయ్య కుటుంబ తగాదాలను మనసులో పెట్టుకుని 2018 మార్చి 17న ఇనుప రాడ్‌తో గాయపరిచాడు. కత్తితో పొడిచి హత్యాయత్నానికి ప్రయత్నించడంతో అప్పటి కొమరోలు ఎస్సై ప్రస్తుత మార్కాపురం పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గుడ్‌ట్రైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా సమర్థవంతంగా విచారణ చేపట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొండపాటి గాంధీరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడైన బాదరయ్యకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఐవీ శ్రీనివాసరావు, పట్టణ ఏఎస్సై ఎస్కే మునాఫ్, కొమరోలు కోర్టు కానిస్టేబుల్ అంజినాయక్‌ను ఎస్పీ పరమేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన వెంకటనారాయణరెడ్డి

పెద్దారవీడు: పంటలకు నీరు పెట్టేందుకు ప్యానల్ బోర్డు స్విచ్ వేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండలంలో గొబ్బూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెన్నా వెంకటనారాయణరెడ్డి(48) తన పొలంలో ప్యానల్ బోర్డును సరిచేసి స్విచ్ వేస్తున్న సమయంలో ఒక్కసారిగా షాక్‌కు గురై మృతి చెందాడు. పక్క పొలంలో పనిచేసుకుంటున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య, పిల్లలు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఆక్వా రైతుల సమావేశం

ఒంగోలు సెంట్రల్: కోస్టల్ ఆక్వా అథారిటీ(సీఏఏ), మత్స్యశాఖ, రొయ్యల రైతుల సంఘం సంయుక్తంగా ఆక్వా రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ తెలిపారు. ఒంగోలులోని రంగారాయుడు చెరువు వద్ద పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా సీఏఏ డైరెక్టర్ శంకరరావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆక్వా రైతులు పాల్గొని సాగులో మెళకువలు తెలుసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సింగరాయకొండ(జరుగుమల్లి): కంటైనర్ లారీ మరో మినీ లారీని ఢీకొట్టిన ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున సింగరాయకొండ మండల పరిధిలోని కనుమళ్ల జంక్షన్ వద్ద విమానాల రన్‌వేపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి కంటైనర్ లారీ ఒంగోలు వైపు వస్తోంది. అదే సమయంలో బాపట్ల నుంచి నెల్లూరు జిల్లా దగదర్తికి రొయ్యల వ్యర్థాల లోడ్‌తో వెళ్తున్న మినీ లారీని కంటైనర్ డ్రైవర్ నిద్రమత్తులో ఢీకొట్టాడు. దీంతో విమానాల రన్ వే మీద మినీ లారీ తిరగబడింది. బీహార్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ బాబుల్ కుమార్ తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, హైవే మొబైల్ టీమ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మినీ లారీ డ్రైవర్‌ని బయటకు తీశారు. కుమార్‌తోపాటు కంటైనర్ డ్రైవర్ శ్రీనును 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను పక్కకు మళ్లించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై శ్రీరామ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపేదలకు సేవ చేయాలి

- అప్పుడే వైద్య విద్యకు సార్థకత
- ఐఎంఏ అధ్యక్షురాలు ఝాన్సీ
- రిమ్స్‌లో అట్టహాసంగా 2018 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ సెర్మనీ

ఒంగోలు టౌన్: సమాజంలో మన చుట్టూ ఉన్న నిరుపేదలు, అభాగ్యులకు సేవ చేసినప్పుడే వైద్య విద్యకు సార్థకత లభిస్తుందని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ పి.ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఒంగోలులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్-2018 బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీ అట్టహాసంగా నిర్వహించారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఝాన్సీ ప్రసంగిస్తూ.. సంపాదన కోసం పరుగులు తీయకుండా సమాజం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. సంపాదనలో కొంత భాగం సమాజంలోని నిరుపేదల కోసం ఖర్చు చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండేందుకు సహజ పద్ధతులు పాటించాలని చెప్పారు. వైద్య విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, క్రమశిక్షణ, నైతిక విలువలు పాటిస్తూ మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకోవాలని ప్రిన్సిపాల్, ఏడీ ఎంఈ డాక్టర్ ఏడుకొండలు సూచించారు. చదువు పూర్తి చేసి సమాజంలోకి వెళ్లిన తర్వాత జీవితాన్ని చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. ఒకవైపు సంపాదిస్తూనే మరోవైపు ఉన్నత చదువులు కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. చికిత్స కోసం వచ్చిన పేషంట్లను కసురుకోవద్దని, నిరుపేద రోగులకు సాయం చేసేందుకు శతథా ప్రయత్నించాలని బోధించారు. చికిత్స కంటే రోగులతో మనం సానుకూలంగా స్పందించిన తీరే ఎక్కువగా ప్రభావం చూపుతుందన్నారు. వైద్యంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర భగవాన్ నాయక్ సూచించారు. తొలుత గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న మెడికోలతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అనాటమీ హెచ్‌ఓడీ సుధాకర్ బాబు, కళాశాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికోలు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.


గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు


నృత్యం ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థిని


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ భగవాన్‌నాయక్, డాక్టర్ ఏడుకొండలరావు


డిగ్రీ అందుకున్న కుమార్తెను ముద్దాడుతున్న తల్లి

పేదల పక్షపాతి సీఎం జగన్


బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కురిచేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. కురిచేడు మండలంలోని పొట్లపాడు, మొండెద్దులపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి మన ఊరికి మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందినికి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కోదండ రామాలయం, గుత్తికొండ రామయోగితాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామయోగితాత ఆలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాకు డీబీటీ ద్వారా నిధులు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాత్రమేనన్నారు దేశం గర్వించదగ్గ ముఖ్యమంత్రిగా, తండ్రిని మించిన తనయుడిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నాడన్నారు. ఓదార్పు యాత్ర సందర్భంగా జోరువానను సైతం లెక్క చేయకుండా వైఎస్ జగన్ వెంట గ్రామస్తులంతా ఏకతాటిపై నడిచారని గుర్తు చేసుకున్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి గ్రామంలో రూ.10 కోట్లతో తాగునీటి పథకం ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు తమకు ఇష్టమొచ్చినవారికి పథకాలు అందించి, పేదలకు మొండి చేయి చూపారని విమర్శించారు. ఎన్నికల సమయంలో వచ్చి మోసపు వాగ్దానాలు చేసి చేతులు దులుపుకొనే నాయకుడు చంద్రబాబు అయితే.. మేనిఫెస్టోలో నిచ్చిన హామీలు పూర్తిగా అమలు చేసి పాలనపై సంతృప్తి చెందితేనే ఓటు వేయాలని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. గ్రామస్తులు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అప్పటి వరకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ నిధులతో డ్రెయిన్లు, అంతర్గత రోడ్లు నిర్మిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేర్చే ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డితోపాటు దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గడిచిన 20 ఏళ్లుగా పేదలకు సేవ చేయడంలో బూచేపల్లి కుటుంబం ముందుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మెరుగైన విద్య, వైద్యం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నుసుం ప్రతాపరెడ్డి, నుసుం రామకోటిరెడ్డి, పాలం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఆవుల లక్ష్మీవెంకటరెడ్డి, ఎంపీటీసీ కానాల శివారెడ్డి, మొండెద్దు రమణారెడ్డి, సుబ్బారెడ్డి, మహానందిరెడ్డి, సుందరరామిరెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి, పడమర గంగవరం, బయ్యవరం సర్పంచులు కాసు భాస్కరరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, జ్యోతిరెడ్డి, డాక్టర్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి లక్ష్మీరెడ్డి, గుర్నాథం, సుబ్బారెడ్డి, రమేష్, వీరగంధం కోటయ్య, కోటిరెడ్డి, జక్రయ్య, రామసుబ్బయ్య, గాలి సుబ్బయ్య, రొడ్డా వెంకటరెడ్డి, డి.అంకారావు, యోగేశ్వరరావు, పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, సారెడ్డి నాగిరెడ్డి, గుంటక నాసరరెడ్డి, లింగారెడ్డి, కాశీం షరీఫ్, శ్రీనివాసరెడ్డి, నాగరత్నం, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

త్వరలో షాదీఖానా నిర్మాణం పూర్తి

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో సుమారు 25 వేల మంది ముస్లింల చిరకాల కల అయినటువంటి షాదీఖానా నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్పష్టం చేశారు. గురువారం రాత్రి ఆయన పార్టీ ముస్లిం నేతలు, అధికారులతో కలిసి షాదీఖానా పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. షాదీఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సీఎం వైఎస్ జగన్ వద్ద పట్టుబట్టి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారని, సాంకేతిక అవరోధాలు కూడా తొలగిపోయాయని, వేగంగా షాదీఖానా నిర్మాణం పూర్తవుతుందని అన్నారు.


నేను షో చేసే మనిషిని కాను

నేను షో చేసే మనిషిని కాననీ, మాటచెబితే కచ్చితంగా నెరవేరుస్తానని, తనపై విమర్శలు చేసేముందు ఆలోచించాలని ఎమ్మెల్యే రాంబాబు అన్నారు. ఇన్నేళ్లకు ముస్లింల కల నెరవేరుతోందన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. తన వ్యక్తిత్వం, విధానాలు అందరికీ తెలిసినా రాజకీయ కోణంలో విమర్శలు చేయడం సరికాదన్నారు.

వైఎస్సార్ హయాంలోనే ముస్లింల సంక్షేమం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ముస్లింల సంక్షేమం జరుగుతోందని, 4 శాతం రిజర్వేషన్ల వల్ల ముస్లిం మైనార్టీలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ పేర్కొరు. మార్కాపురంలోని ముస్లిం మైనార్టీలందరూ వైఎస్సార్ సీపీ వెంట నడుస్తారని, వారి సంక్షేమానికి ఎమ్మెల్యే అన్నా కృషి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ ఉన్నారు. ఎమ్మెల్యే అన్నాకు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ఇస్మాయిల్, కౌన్సిలర్లు సిరాజ్, సలీమ్, షెక్షావలి, అమీరుల్లాఖాన్, ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మక్బుల్‌బాషా, ఉస్మాన్, మాజీ వైస్ చైర్మన్ షెక్షావలి, ప్రచార కార్యదర్శి అమీరుల్లాఖాన్, సలీమ్ ఆసీఫ్‌ఖాన్, నజీర్ అహ్మద్, జిలానీ, రఫీ, సీఎం ఖాశీం, చాంద్‌బాషా, కరిముల్లా, మున్సిపల్ డీఈ సుబానీ, ఏఈ ఆదినారాయణ, కోఆప్షన్ సభ్యులు రఫీ తదితరులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

ఫెన్సింగ్‌లో చిక్కుకుని దుప్పి మృతి


దుప్పికి పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

దర్శి: నీటి కోసం వెళ్తూ పొలానికి వేసిన ఫెన్సింగ్‌లో చిక్కుకుని దుప్పి మృతి చెందిన సంఘటన చీమకుర్తి మండలంలోని వెంకటాచలంపల్లె గ్రామం శివారులో చోటుచేసుకుంది. దుప్పి ఫెన్సింగ్‌లో ఇరుక్కుని ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దుప్పిని బయటకు తీసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ అధికారి అమర, ఇతర అధికారులు మృతి చెందిన దుప్పిని పరిశీలించారు. నిబంధనల ప్రకారం దుప్పికి పశువైద్యులు పోస్ట్‌మార్టం నిర్వహించారు.

పోలేరమ్మ ఆలయానికి రూ.65.26 లక్షల ఆదాయం

జరుగుమల్లి: ప్రసిద్ధిగాంచిన కామేపల్లి పోలేరమ్మ ఆలయానికి దుకాణాల నిర్వహణ హక్కుల వేలం ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. ఆలయ ఆవరణలో దేవదాయ అధికారులు గురువారం బహిరంగ వేలం నిర్వహించగా రూ.65,26,500 ఆదాయం లభించింది. వేలాన్ని ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యన్నారయణ, ఈఓ రావెళ్ల శివశంకర్ పర్యవేక్షించారు. గత ఏడాది 9 ఐటమ్‌లకుగాను రూ.36,70,400 మాత్రమే వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- పార్టీ నేతల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

రాచర్ల: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీసీ భవనంలో గురువారం సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి 14 పంచాయతీల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. నవరత్నాలు పథకాలను కుల, మత, పార్టీలు చూడకుండా అర్హులకు నేరుగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మ, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, వైస్ ఎంపీపీ ఎలిశమ్మ, జేఏసీ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, అనుములపల్లె, పాలకవీడు, ఆకవీడు, కాలువపల్లె, గౌతవరం సర్పంచులు సిరిగిరి రమేష్, పల్నాటి లతీఫ్, దేవదానం, మీనిగ నారాయణమ్మ, లక్ష్మీదేవి, ఎంపీటీసీలు రవి, యేలం వెంకట రాజేశ్వరి, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు సూరా పాండురంగారెడ్డి, సూరా స్వామిరంగారెడ్డి, బద్దేటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.